ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 3 జూన్ 2024 | 5

ఒమ్మంగి యువకుడి దారుణ హత్య

వార్త..7లో



రాగల 24 గంటల్లో

రాగల 24 గంటల్లో 21 రోజుల ఉత్కంఠకు తెరపడుతుంది..

రాగల 24 గంటల్లో వందలాది మంది అభ్యర్థుల భవితవ్యం తేలిపోతుంది.

రాగల 24 గంటల్లో ప్రజా తీర్పు ఏ మార్పు కోరుకుందో అర్థమైపోతుంది..

రాగల 24 గంటల్లో 'విజయ మాల' ఎవరి మెడలో పడుతుందో తెలిసిపోతుంది..

రేపే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్

- కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వర్సిటీ ప్రాంగణానికి రెండు కిలోమీటర్ల మేర రెడ్‌జోన్
- అటుగా వచ్చే వాహనాలను దారి మళ్లించనున్న పోలీసులు
- కౌంటింగ్ సెంటర్ వద్ద నాలుగంచెల భద్రతా వ్యవస్థ
- ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం

● కలెక్టరేట్(కాకినాడ)

సార్వత్రిక ఎన్నికల చివరి అంకం అయిన కౌంటింగ్ ప్రక్రియకు కౌంట్‌డౌన్ మొదలయ్యింది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్, జగ్గంపేట, కాకినాడ సిటీ, పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు కాకినాడ జేఎన్టీయూ ప్రాంగణం వేదిక కానుంది. ఈ మేరకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు.. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ కలిపి ఏడు నియోజకవర్గాలకు 112 టేబుళ్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 1640 ఉన్నాయి. మొత్తం 13,12,255 మంది ఈవీ ఎంల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 18,470 మంది ఓటు వేశారు. మొత్తంగా జిల్లాలో 81 శాతం పోలింగ్ నమోదైంది.

ఒకేసారి కౌంటింగ్

కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకేసారి లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు సమాంతరంగా అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియకు 6 గంటల నుంచి 10 గంటలు పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఆ తర్వాత ఈవీఎంల కౌంటింగ్ మొదలవుతుందని అధికారులు పేర్కొన్నారు. తుని అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 16 రౌండ్లు, ప్రత్తిపాడు 17 రౌండ్లు, పిఠాపురం 18 రౌండ్లు, కాకినాడ రూరల్ 19 రౌండ్లు, పెద్దాపురం 15 రౌండ్లు, కాకినాడ సిటీ 17 రౌండ్లు, జగ్గంపేట 18 రౌండ్లలో ఫలితం తేలనుంది.. మొదటి ఫలితం పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి వచ్చే అవకాశం ఉంది. చివరిగా కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన ఫలితం వచ్చే అవకాశం ఉంది. ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి 18 మంది సూపర్‌వైజర్లు, మరో 18 కౌంటింగ్ సహాయకులు, 18 మంది మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహించనున్నారు.

రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న అశోక్‌కుమార్



జిల్లా వ్యాప్తంగా బందోబస్తు

- అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు
- జేఎన్టీయూకే లెక్కింపు కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 2: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద, కౌంటింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలతో 3 అంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. కాకినాడ జేఎన్టీయూకేలో ఎన్నికల లెక్కింపు కేంద్రం, ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌తో కలసి పరిశీలించారు. కాకినాడ సిటీలోకి వచ్చే వాహనాలను దారి మళ్లించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ సెంటర్లకు వచ్చే ఎన్నికల లెక్కింపు డ్యూటీ అధికారులకు, రాజకీయ పార్టీల నాయకులు, ఏజెంట్లకు వేర్వేరుగా ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ జరిగే జేఎన్టీయూకే పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడా తగాదాలు, అల్లర్లు జరగకుండా ప్రత్యేక పోలీస్ పికెట్లు, పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐజీపీ వెంట పలువురు ఏఎస్పీలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

నాలుగంచెల భద్రత ఏర్పాటు చేశాం

కాకినాడ క్రైం, జూన్ 2 : 'సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద నాలుగు అంచెల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశాం. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేందుకు అవసరమైన అన్ని రకాల భద్రత, రక్షణ చర్యలు తీసుకున్నాం' అని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ప్రశాంతతకు, శాంతి భద్రతలకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించే ఎంతటి వారినైనా ముఖ్యంగా రౌడీషీటర్లు, అల్లర్లకు పాల్పడేవారిని ఉక్కుపాదంతో అణచివేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో గల పోలీసు కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన నిర్వహించే ఎన్నికల కౌంటింగ్‌కు బందోబస్తు విధులపై వెళుతున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జేఎన్‌టీయూ చుట్టుపక్కల పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధించినట్లు చెప్పారు. కౌంటింగ్ సందర్భంగా ఎక్కడా ఏవిధమైన అల్లర్లు, గొడవలు జరగకుండా పోలీస్ పికెట్లు, స్పెషల్ పార్టీలతో పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రౌడీలు, అల్లర్లు సృష్టించే వారిని బైండోవర్ చేశామన్నారు. ఎవరైనా ఘర్షణలు, తగాదాలు, అల్లర్లు చేసినా కఠినంగా వ్యవహరించి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. జేఎన్‌టీయూలో కౌంటింగ్ జరిగే కేంద్రాల వద్ద జిల్లా పోలీసులు, కేంద్ర బలగాలు, సాయుధ పోలీసు బలగాలతో నాలుగంచెల భద్రతా వలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిరంతర పర్యవేక్షణ పక్కాగా జరగాలన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు. మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బందోబస్తు విధుల్లో ప్రతిభ కనబరచిన సిబ్బందికి నగదు, ప్రశంసాపత్రాల బహుమతులను ఐజీపీ అశోక్‌కుమార్, ఎస్పీ సతీష్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, అదనపు ఎస్పీ ఏఆర్ బి.సత్యనారాయణ, అదనపు ఎస్పీ సెబ్ కె.శ్రీలక్ష్మి, కాకినాడ ఎస్‌డీపీవో కె. హనుమంతరావు పాల్గొన్నారు



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ నివాస్

ఓట్ల లెక్కింపునకు సర్వం సన్నద్ధం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 2: రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఆదివారం కాకినాడ జేఎన్‌టీయూకేలో అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరచిన జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత, నిఘా వ్యవస్థ, ఓట్ల లెక్కింపు కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్లను ఆర్వోలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కౌంటింగ్ కేంద్రాల బయట భోజన వసతి, మొబైల్ ఫోన్ల కౌంటర్లు ఏర్పాటుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జగ్గంపేట, ప్రత్తిపాడు ఆర్వోలు ఎం. శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు ఉన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 2: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైనదని ప్రశాంత వాతావరణంలో సజావుగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ ఆదేశించారు. మైక్రో అబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమం ఆదివారం కాకినాడ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. దీనిలో కాకినాడ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్‌జోగ్‌పాల్‌తో కలిసి కలెక్టర్ నివాస్, జేసీ, పిఠాపురం ఆర్వో ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి హాజరయ్యారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, వీవీ ప్యాడ్స్ స్లిప్పులు కౌంటింగ్, రీకౌంటింగ్, రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడి చేసే విధానంపై అవగాహన కల్పించారు. జేఎన్టీయూకేలో మంగళవారం నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందని అభ్యర్థులకు కౌంటింగ్ ఏజెంట్లకు ఎటువంటి సందేహం లేకుండా ప్రతిదశలోనూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ప్రత్యేక పరిస్థితులు నెలకొన్న సందర్భంలో కౌంటింగ్ ఆలస్యం కాకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి పి.త్రినాథ్, జడ్పీ సీఈవో రామ్‌గోపాల్, జిల్లా నోడల్ అధికారి నారాయణమూర్తి పాల్గొన్నారు.





మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

పిఠాపురంలో హై అలర్ట్

- రంగంలోకి సెంట్రల్ పారా మిలటరీ ఫోర్స్
- రబ్బర్‌బుల్లెట్ పార్టీలు
- నియోజకవర్గంలో అయిదు అంచెల భద్రత
- ప్రత్యేకంగా ఎస్పీ స్థాయి అధికారి నియామకం

పిఠాపురం, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంపై కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇక్కడ నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో జాతీయ, రాష్ట్రస్థాయిలో పిఠాపురం నియోజకవర్గం ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. జిల్లా కేంద్రమయిన కాకినాడకు అతి సమీపంలో ఉండటం, పవన్ పోటీ చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. భద్రత పర్యవేక్షణకు ఎస్పీ స్థాయి అధికారిని నియమించింది. పిఠాపురం నియోజకవర్గంలో భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గానికి ఏసీబీ ఎస్పీ రామ్మోహనరావును ప్రత్యేకంగా నియమించారు. సమస్యాత్మక ప్రాంతాలతో పాటు నియోజకవర్గమంతా మోహరించేందుకు కేంద్ర పోలీసులు బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, ఏఎస్ఎస్ పార్టీలు, ఏపీఎస్పీ పోలీసులు, బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్‌లు, రబ్బర్ బుల్లెట్, టియర్ గ్యాస్ పార్టీలు రంగంలోకి దిగాయి. కేంద్ర పోలీసు బలగాలతో ఎస్పీ రామ్మోహనరావు, ఇతర పోలీసు అధికారులు పిఠాపురం పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల 216వ జాతీయ రహదారిపై గొల్లప్రోలు టోల్‌ప్లాజ్ వద్ద పోలీసు కవాతుతో పాటు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎక్కడికక్కడ పోలీసు పికెట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రోన్ కెమెరాలను రప్పించారు. ప్రస్తుతం ఉన్న బలగాలకు అదనంగా సోమవారం మరిన్ని కేంద్ర, రాష్ట్ర రిజర్వ్ బలగాలు పిఠాపురం రానున్నాయి. వీరిని ముఖ్యమైన కూడళ్లలో భద్రత నిమిత్తం నియమించనున్నారు. అదే విధంగా పాత ఎన్నికల కేసుల్లో ఉన్న వారిని ముందుగానే అదుపులోకి తీసుకుని కల్యాణ మండపాలు, ఇతర హాల్స్‌కు తరలించి వారిని ఉదయం నుంచి రాత్రి వరకూ అక్కడే ఉంచనున్నారు. అల్లర్లు సృష్టించే అవకాశం ఉందని భావిస్తున్న వారికి ఇళ్లు వదిలి బయటకు రావద్దని నోటీసులు జారీ చేశారు. కాకినాడ జేఎన్‌టీయూలోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి అనుమతి పొందిన ఏజెంట్లు, అభ్యర్థులు, వారి తరపు ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మినహా మిగిలిన వారు ఎవ్వరు వెళ్లకుండా నియంత్రించనున్నారు. ఇందు నిమిత్తం నియోజకవర్గంలో అయిదు అంచెల భద్రత ఏర్పాటు చేశారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ సెంటర్, మండలంలోని ఎఫ్‌కేపాలెం-కందరాడ జంక్షన్, చిత్రాడ మహాలక్ష్మి గుడి, 216వ జాతీయ రహదారిపై గల గొల్లప్రోలు టోల్‌ప్లాజా, ఉప్పాడ బీచ్ రోడ్డుల్లో కటాఫ్ పార్టీలను మోహరిస్తున్నారు. వీరు అక్కడ నుంచి అనుమతి పొందిన వారు మినహా మిగిలిన వారు కాకినాడ వెళ్లకుండా నియంత్రిస్తారు.

కౌంటింగ్ కేంద్రానికి వెళ్లకుండా అన్నిచర్యలు తీసుకున్నాం

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అన్ని భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని ఎస్పీ రామ్మోహనరావు తెలిపారు. మాక్‌డ్రిల్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర బలగాలతో స్థానిక పోలీసులు భద్రతా విధుల్లో ఉంటారని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని, భారీగా పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు. ఎస్పీ వెంట కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, సీఐ శ్రీనివాస్, సర్కిల్‌లోని ఎస్ఐలు తదితరులు ఉన్నారు.



తుని మండలం తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం అశేష భక్తజనంతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వేలాది మంది తరలిరావడంతో లోవ ప్రాంగణం కిక్కిరిసింది.


7లో

జాతీయ రహదారిపై గొల్లప్రోలు-పిఠాపురం మధ్య గల టోల్‌ప్లాజా



టోల్ బాదుడు

- ఆదివారం అర్ధరాత్రి నుంచి పెరిగిన టోల్‌చార్జీలు
- నేటి నుంచి వసూళ్లకు రంగం సిద్ధం
- ఎన్నికలు ముగియడంతో గ్రీన్‌సిగ్నల్
- వాహనదారులకు భారీ షాక్



పెరిగిన చార్జీలను సూచించే బోర్డు

గొల్లప్రోలు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతోనే టోల్ బాదుడు మొదలయింది. అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా ఉన్న టోల్‌ప్లాజాల్లో చార్జీలను పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. అయిదు శాతమే పెంచామని నేషనల్ హైవే అథారిటీ చెబుతున్నా అంతకంటే అధికంగా చార్జీలను పెంచారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే వాహనదారులకు భారీ షాక్ తగిలింది. దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికల పోలింగ్ ముగియడంతో ప్రజలపై భారం మోపేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వలేదంటూ సాకులు చెబుతూ పోలింగ్ ముగిసిన వెంటనే భారం మోపడంపై వాహనదారులు మండిపడుతున్నారు. అయిదు శాతమే పెంచుతున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవంగా కొన్ని కేటగిరీ వాహనాలకు 10నుంచి 20 శాతం వరకూ చార్జీలను పెంచేశారు.

కాకినాడ జిల్లాలో 216వ జాతీయ రహదారిపై పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల గొల్లప్రోలు టోల్‌ప్లాజా, తుని-రాజమహేంద్రవరం మధ్య గల 16వ నెంబరు జాతీయ రహదారిపై గల కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద వసూలు చేసే చార్జీలను పెంచారు. పెంచిన చార్జీలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చాయి. సాధారణంగా ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1వ తేదీన దేశవ్యాప్తంగా టోల్ గేట్లు వద్ద వసూలు చేసే చార్జీలను సవరిస్తూ ఉంటారు. ఈ పర్యాయం అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడం, ఏడు విడతల పోలింగ్ ముందు ఉన్న నేపథ్యంలో చార్జీలు పెంచాలన్న నేషనల్ హైవే అథారిటీ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. అయితే చార్జీల పెంపునకు ఎన్నికల కమిషన్ అంగీకరించలేదంటూ అప్పట్లో చెప్పుకొచ్చారు. ఎన్నికల చివరి దశ పోలింగ్ జూన్ 1వ తేదీన ముగియడంతోనే మరలా టోల్‌చార్జీల పెంపు నిర్ణయాన్ని మళ్లీ తెరపైకి తీసుకువచ్చారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలను పెంచాలని నేషనల్ హైవే అథారిటీ నిర్ణయించింది. ఆ మేరకు ఆదేశాలు జారీ చేయడంతో పెరిగిన చార్జీలు అమలులోకి వచ్చాయి.

చార్జీల పెంపు ఇలా..

గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం అర్ధరాత్రి నుంచి పెరిగిన చార్జీలను వాహనదారులు నుంచి వసూలు ప్రారంభించారు. కారు, జీపు, వ్యాన్, ఇతర తేలికపాటి వాహనాలకు ఇప్పటి వరకూ ఒకవైపు టోల్‌చార్జీలు రూ.45 ఉండగా ఆ చార్జీలను 50 రూపాయలకు పెంచారు. 24 గంటల్లోపు తిరిగి వస్తే రెండు వైపులా చార్జీ 75 రూపాయలకు పెరిగింది. తేలికపాటి వ్యాపార వాహనాలు, మినీబస్సులు ఒకవైపు చార్జీ రూ.75 ఉండగా, 80 పెంచగా, రెండు వైపులా చార్జీని రూ.115 నుంచి 120కి, మూడు యాక్సిల్స్ ఉన్న కమర్షియల్ వాహనాల ఒకవైపు టోల్‌చార్జీలు రూ.175 నుంచి 185కు, రెండు వైపులా చార్జి రూ.260 నుంచి రూ.280లకు, బస్సు లేదా ట్రక్‌కు రూ.160 నుంచి 170కి, రెండు వైపులా చార్జీని రూ.240 నుంచి రూ.255కి పెంచారు. భారీ నిర్మాణ మెషినరీ, మల్టీ యాక్సిల్ (4లేదా 6) వాహనాలకు ఒక వైపు చార్జీ రూ.250 నుంచి రూ.270కి, రెండు వైపులా చార్జీని రూ.375 నుంచి రూ.400కి, ఏడు లేదా అంతకంటే పెద్ద యాక్సిల్స్ కలిగిన వాహనాలకు ఒకవైపు టోల్ చార్జీలు రూ.265 నుంచి ఏకంగా రూ.325కి పెంచారు. రెండు వైపులా చార్జీని రూ.455 నుంచి రూ.490కి పెంచారు. లోకల్ వాహనాలకు నెలవారీ పాస్ చార్జీలను రూ.300 నుంచి రూ.340కి పెంచారు. 16వ జాతీయరహదారిపై గల కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద ఇదే రీతిలో చార్జీలు పెరిగాయి.



టోల్‌ప్లాజా వద్ద ఇప్పటివరకూ అమలులో ఉన్న చార్జీలు

ఇదేం బాదుడు

ఒకేసారి భారీగా చార్జీలు పెంచడంతో వాహనదారులు షాక్‌కు గురయ్యారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు నుంచే గొల్లప్రోలు, కృష్ణవరం టోల్‌ప్లాజాల వద్ద పెంచిన చార్జీలను వసూలు చేయడం ప్రారంభించారు. విషయం తెలియని వాహనదారులు తమ వద్ద ఎందుకు అధికంగా టోల్ చార్జీలు కట్ చేశారంటూ టోల్‌ప్లాజా సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ఎన్నికల ముందు టోల్‌చార్జీలను పెంచితే వ్యతిరేకత వస్తుందనే కేంద్ర ప్రభుత్వం పెంచకుండా పోలింగ్ ముగియగానే పెంచిందని వాహనదారులు మండిపడుతున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రావెల్ బస్సు



ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న దృశ్యం

- ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు మరో 29 మందికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న 108 సిబ్బంది



ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న క్షతగాత్రులు

ముమ్మిడివరం, జూన్ 2: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో 29 మంది గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగింది. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బొలేరో వ్యాన్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు, మరో 25 మంది గాయపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో డ్రైవరుతో పాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. కాకినాడ నుంచి అమలాపురం వెళుతున్న మరో ఆర్టీసీ బస్సు కొరంగి వద్ద ఆగిపోవడంతో ఆ బస్సులో ఉన్న ప్రయాణికులను కూడా ప్రమాదానికి గురైన బస్సులోకి ఎక్కించడంతో బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సులో గాయపడిన డ్రైవరుతో పాటు 25 మంది ప్రయాణికులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వారిలో 12 మంది క్షతగాత్రులను అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో అంబాజీపేటకు చెందిన డి.రామసీత, కాకినాడకు చెందిన జి.శ్రీనివాస్, భీమవరానికి చెందిన డి.జాన్‌బాబు, గుత్తెనదీవికి చెందిన సీహెచ్ కృష్ణవేణి, అమలాపురానికి చెందిన కె.సాయివేణి, అయినాపురానికి చెందిన ఎన్.కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్‌లో గాయపడిన డ్రైవరు, ఇద్దరు ప్రయాణికులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ బి.సురేష్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దు

- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవిప్రకాష్
- లెక్కింపు ప్రాంతంలో మూడంచెల భద్రత: తూర్పు ఎస్పీ



ఓట్ల లెక్కింపు భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ రవిప్రకాష్

దివాన్‌చెరువు/రాజమహేంద్రవరం, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సెక్షన్ సీఆర్‌పీసీ, సెక్షన్ పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరూ ఉద్వేగపూర్వక, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్, ఓట్ల లెక్కింపు నిమిత్తం ఏలూరు రేంజ్‌కు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఎం.రవిప్రకాష్ హెచ్చరించారు. ఆదికవి నన్నయ విద్యాలయాన్ని ఆదివారం ఎస్పీ పి.జగదీష్‌తో కలసి ఆయన ఆదివారం సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, బందోబస్తు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించకూడదన్నారు. అన్ని రాజకీయపార్టీల నాయకులు తమ కేడరు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చూసుకోవాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ట్రయల్ రన్ ఆదివారం నిర్వహించామన్నారు. లెక్కింపు జరిగే ప్రాంతంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు కేంద్రం ఆవరణలో 152 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి కంట్రోల్ రూమ్ సిబ్బంది ద్వారా వాటిని మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. లెక్కింపు సిబ్బంది, ఏజెంట్లు, జనరల్ ఏజెంట్లు, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తామన్నారు. దీనికోసం 40 డీఎఫ్ఎండీఎస్, శిక్షణ పొందిన సిబ్బందిని నియమించామన్నారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. లెక్కింపు సిబ్బందికి, ఏజెంట్లకు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా సూచనలిస్తామన్నారు. అత్యవసర ఏర్పాట్లలో భాగంగా అక్రమంగా గుమిగూడిన వారిని చెదరగొట్టడానికి వజ్రవాహనం, టియర్ గ్యాస్ ఎక్విప్‌మెంట్, అంబులెన్స్, ఫైరింజన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు. లెక్కింపు అనంతరం అవాంఛనీయ సంఘటనలను నిరోధించే క్రమంలో 129 సమస్యాత్మక గ్రామాలను, ప్రాంతాలను గుర్తించి ఆ ప్రదేశాల్లో 39 పోలీస్ పికెట్‌లు, 59 మొబైల్ పార్టీలను, 13 క్యూఆర్టీ బృందాలను నియమించామన్నారు. అభ్యర్థుల ఇళ్ల వద్ద, పార్టీ కార్యాలయాలవద్ద పికెట్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, మీడియా మిత్రులు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

పవన్ మెజార్టీపై జాతీయస్థాయిలో ఉత్కంఠ

- ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
- జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, జూన్ 2: ఎన్నికల ప్రక్రియలో చివరి అంకమైన కౌంటింగ్‌లో ఏజెంట్ల పాత్ర కీలకమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం శివారు గోకులం గ్రాండ్‌లో ఆదివారం సాయంత్రం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సాధించబోయే మెజార్టీపై జాతీయస్థాయిలో ఉత్కంఠ ఉందని చెప్పారు. ఏ ఒక్క ఓటు కూడా లెక్క తప్పకుండా చూసుకోవాల్సిన బాధ్యత కౌంటింగ్ ఏజెంట్లపై ఉందని తెలిపారు. తాజాగా వెలువడిన ఎగ్జిట్‌పోల్స్ కూటమికి ప్రోత్సాహకరంగా ఉన్నాయని చెప్పారు. భీమవరంలో కౌంటింగ్ సమయంలో జరిగిన పొరపాట్లు కారణంగా నష్టపోయామని గుర్తుచేస్తే అటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ సందేహాలు కలిగితే వెంటనే ఆర్వోకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశంలో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, మర్రెడ్డి శ్రీనివాస్, యాతం నగేష్, సందీప్ పాల్గొన్నారు.

కృష్ణబాబుకు ఘన నివాళి



మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 2: కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరులో జరిగిన కృష్ణబాబు దశ దిన కార్యక్రమానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు విచ్చేసి కృష్ణబాబు సోదరుడు ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ చైర్మన్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)తో పాటు కృష్ణబాబు అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, రాజమహేంద్రవరం పార్లమెంటు కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, సినీ నిర్మాత కేఎల్ నారాయణ, కొవ్వూరు, గోపాలపురం కూటమి అభ్యర్థులు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ మంత్రులు సీహెచ్ అయ్యన్నపాత్రుడు, కామినేని శ్రీనివాస్, కావూరి సాంబశివరావు, దొడ్డికర్ల సువర్ణరాజు, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామ్, టీవీ రామారావు, అవినాష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, ఇమ్మణి వీరశంకరం, కేవీకే రంగారావు పాల్గొని కృష్ణబాబుకు నివాళులర్పించారు.

విషపురుగు కాటుకు మహిళ మృతి



సామర్లకోట, జూన్ 2: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధి కొత్తపేట భీమవరం ప్రాంతానికి చెందిన తాతపూడి మేరీ(44) ఆదివారం తెల్లవారుజామున విషపురుగు కాటుకు గురైంది. దీంతో కుటుంబసభ్యులు మేరీని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స ప్రారంభించగా చికిత్స పొందుతూ మేరీ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు.

మారేడుమిల్లిలో 378 టేకు చెట్ల కథ

కంచికేనా ?

- సరుకు దొరికేసింది, స్మగ్లింగ్ జరగలేదంటున్న అటవీ అధికారులు
- ఆదివాసీల పోడు వ్యవసాయం నేరమైతే, టేకు చెట్ల నరికివేత నేరం కాదా?
- ఇప్పటికే మారేడుమిల్లి భాగోతంపై ప్రభుత్వంవద్ద నివేదిక పెండింగ్
- అనుకూల ప్రభుత్వమే వస్తుందన్న ఆశలో అక్రమార్కులు



టేకు ప్లాంటేషన్‌లో విచారణ జరుపుతున్న అధికారులు (ఫైల్)

(రంపచోడవరం)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైన మారేడుమిల్లి అటవీ ప్లాంటేషన్లలో అక్రమ నరికివేతకు గురైన 378 టేకు చెట్ల కథ కంచికి పోయినట్టే అన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రక్షిత అటవీ ప్రాంతంలోని టేకు ప్లాంటేషన నుంచి పెద్దఎత్తున చెట్ల నరికివేత, గల్లంతు భాగోతాలు వెలుగుచూసిన వెంటనే అటవీ శాఖకు చెందిన రాష్ట్ర ముఖ్య అధికారి ఆదేశాలతో సమగ్ర విచారణ ప్రారంభమైంది. రాజమండ్రి సీసీఎఫ్ పర్యవేక్షణలో ఇతర ప్రాంతాల డీఎఫ్‌వోలు, పలువురు సీనియర్ అధికారులతోపాటు విజిలెన్సు విభాగం కూడా విచారణ సాగించి నిగ్గు తేల్చింది. తొలుత 300 చెట్ల నరికివేతను గుర్తించగా, తర్వాత జరిగిన పలు విచారణలతో నరికివేసిన చెట్ల సంఖ్య 378కి చేరింది. ఈ నరికివేత వెనుక అటవీ శాఖ ఇంటిదొంగల పాత్రే కీలకంగా ఉందన్న సంగతి అందరికీ తెలిసిందే! ఇందులో దొంగలను పట్టే పనికంటే నరికివేతకు గురైన చెట్లకు సరిపడ సరుకును గుర్తించి, దానిని రాబట్టి ప్రభుత్వానికి నష్టం చేకూరలేదన్న వాదనను వినిపించేందుకే అధికారులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

అటవీ చట్టం కింద కానీ, అటవీ సంరక్షణ చట్టం కింద కానీ అటవీ ప్రాంతంలో పర్యావరణ హితం కానీ ఏ వినాశనం జరిగినా అది నేరమే! రక్షిత అటవీ ప్రాంతం గుండా రెండు హెక్టార్లకు మించి కనీసం రహదారి కోసం కూడా అనుమతించవద్దని చట్టం చెబుతోంది. ఈ కారణంతోనే ఆదివాసీల సాంప్రదాయ పోడు వ్యవసాయాన్ని కూడా అటవీ అధికారులు నేరంగా పరిగణిస్తున్నారు. వందలాదిగా ఆదివాసీలు గత కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం నేరం కింద నిందితులయ్యారు.. కానీ రక్షిత అటవీ ప్రాంతంలో టేకు ప్లాంటేషన్లలో వందలాదిగా చెట్లు నరికివేతకు గురైతే మాత్రం అది నేరం కాదన్న సంకేతాన్ని మారేడుమిల్లి టేకుచెట్ల భాగోతం ద్వారా అధికారులు ఇచ్చారు. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును ఉపయోగించి ఇంటిదొంగలను సైతం పట్టాలని అటవీశాఖ రాజమహేంద్ర వరం సీసీఎఫ్ ఇచ్చిన ఉత్తర్వులనే ఇక్కడి అధికారులు ఖాతరు చేయని దుస్థితి.

ఇదిలావుండగా ఈ మొత్తం భాగోతంపై పలు నివేదికల ఆధారంగా రాష్ట్ర అటవీశాఖ ముఖ్య అధికారి ద్వారా ప్రభుత్వానికి సమగ్రంగా నివేదిక చేరినట్టు సమాచారం. ఎన్నికల కోడ్ కారణంగానే ఈ భాగోతం వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొందని సమాచారం. ఇందులో కొందరి అధికారుల గత చరిత్ర నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను నివేదించి తదుపరి నిర్ణయాన్ని ప్రభుత్వానికే వదిలేశారు. ఈ జాప్యాన్ని అనుకూలంగా మార్చుకునే పనిలో పడిన అధికారులు మాత్రం తమకు అనుకూలమైన ప్రభుత్వమే వస్తుందని, క్రింది అధికారులపై చర్యలతోనే ఇది ముగిసి పోతుందన్న ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

నెల కిందటే హత్య చేసి..పూడ్చిపెట్టి

- ఒమ్మంగి యువకుడి దారుణహత్య.. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు
- పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహం వెలికితీత



హత్యకు గురైన మొగలి సతీష్ (ఫైల్)

ప్రత్తిపాడు, జూన్ 2: కాకినాడ జిల్లాప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన మొగలి సతీష్(33)దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు సతీష్‌ను హతమార్చి ఉత్తరకంచి పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా పూడ్చివేశారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం ఉత్తరకంచిలోని ఘటనా ప్రదేశంలో మృతదేహాన్ని వెలికితీశారు. సంచలనంగా మారిన ఈ ఘటనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగలి సతీష్(33)కు పదేళ్లక్రితం ఒమ్మంగికి చెందిన మహిళతో వివాహమైంది. సతీష్ సింహాద్రిపురం నుంచి ఒమ్మంగి వచ్చి భార్యతో కలిసి ఉంటు న్నాడు. ఈ క్రమంలో మే 4న తన భర్త మొగలి సతీష్ అదృశ్యమయ్యాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు గత 29 రోజులుగా ము మ్మర దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు లోతుగా దర్యాప్తుచేసి సతీష్ హత్యకు గురైనట్లు కొనుగొన్నారు. మండలంలోని ఉత్తరకంచి, పొదురుపాక గ్రామాల మధ్య పంట పొలంలో హత్య చేసి పూడ్చివేసిన ప్రదేశాన్ని ఆదివారం ప్రత్తిపాడు తహసీల్దార్ నరసింహరావు, సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్, పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని నెలరోజుల క్రితం పూడ్చివేసిన మృతదేహాన్ని వెలికితీసి శవపంచనామా నిర్వహించారు. సతీష్‌ను ఎందుకు హతమార్చారు అనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వివాహేతర సంబంధంవల్ల జరిగిందా? లేదా పాత క్షకల నేపథ్యంలో సతీష్‌ను హతమార్చారా అనేది తెలియాల్సి ఉంది. సతీష్‌ను హతమార్చిన ఘటనలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ ప్రభుత్వమొచ్చినా ఏముంది?

- రాష్ట్ర విభజనకు పదేళ్లు
- మన ఆస్తిని తెచ్చుకోలేని అసమర్థులం
- పోలవరం వదిలేశారు
- ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వామ్యం
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్



రాజమహేంద్రవరం, జూన్2(ఆంధ్రజ్యోతి) : ఏప్రభుత్వం వచ్చినా ఇంతే. ఏముంది గర్వకారణం. రాష్ట్ర విభజన జరిగి ఆదివారం నాటికి పదేళ్ల పూర్త యింది. మనం మన ఆస్తిని కూడా తెచ్చుకోలేని అసమ ర్థులుగా ఉండిపో తున్నాం. ఇక ప్రభుత్వాలు ఎందుకు? అసలు ప్రొసీజర్‌ను పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ వ్యాఖ్యానించారు. రాజమ హేంద్రవరం ధర్మంచర హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రతిపక్షం కూడా బలంగా ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజలు ఆవిర్భావ దినోత్సవ ఉత్సాహంతో ఉంటే, మనం దశాబ్ది గోసతో బాధపడుతు న్నామన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని వాటితో పాటు రాష్ట్రానికి రావలసిన వాటాను కోటా పొందడంలో ప్రస్తుతం విఫలమయ్యా మన్నారు. 2014-15లో కేంద్ర ప్రభుత్వం 32,625 కోట్ల ఆర్థిక లోటును భర్తీ చేయవలసి ఉంది. కానీ 5,615 కోట్లే వచ్చింది. పోలవరం ప్రాజెక్టు 48 శాతం మాత్రమే పూర్తయింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఇక కేవలం 521 కోట్లు మాత్రమే పోలవరానికి బాకీ ఉన్నట్టు కేంద్రం స్పష్టం చేసిందని వివరించారు. ఇక వెనుకబ డిన ప్రాంతాలు, వివిధ ప్రాజెక్టుల కింద ఏడేళ్లలో 1500 కోట్లు ఇచ్చారు. కానీ ఇంకా 3,520 కోట్లు రావలసి ఉంది. దీనికి కారణం రాష్ట్రంలో కేంద్రం మీద ఒత్తిడి చేసే ప్రభుత్వమే లేదన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి లక్షా 28 వేల కోట్ల విలువైన ఆస్తులు రావాలి. సుమారు లక్షా 60 వేల మంది ఉద్యోగులకు రిటర్మెంట్ బెనిఫిట్స్ ఏ రాష్ట్రం ఇవ్వాలో అర్థంకాని పరిస్థితిలో వారు నష్టపోయారని తెలిపారు. తెలంగా ణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి ఇవి సాధించుకోవడానికి సరైన సమయం అని అన్నారు.

తలుపులమ్మా.. శరణు

- భక్తజన సందోహంగా లోవ క్షేత్రం
- ఒక్కరోజే రూ.5.07 లక్షల ఆదాయం



ఆరుబయట వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

తునిరూరల్, జూన్ 2: తలుపులమ్మ లోవ క్షేత్రం ఆదివారం భక్తజనసందోహంగా మారింది. ఆలయానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని కనులారా తిలకించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన లోవ భక్తులు ఆలయప్రాంగణం మామిడితోటల్లో, ఆలయ వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు సౌకర్యార్థం ఆలయ అధికారులుప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లోవ కూడలిలో రద్దీగా మారిన వాహన ట్రాఫిక్‌ను రూరల్ పోలీసులు నియంత్రించి వాహన రాకపోకలు చక్కబెట్టారు. ఆదివారం ఒక్కరోజు లోవకు తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.5.07లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు

దగ్గుబాటి దంపతులను కలిసిన నల్లమిల్లి, వేగుళ్ల



రాజమహేంద్రవరంలో దగ్గుబాటి దంపతులను సత్కరిస్తున్న ఎన్డీయే కూటమి అనపర్తి, మండపేట అభ్యర్థులు నల్లమిల్లి, వేగుళ్ల

అనపర్తి, జూన్ 2: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులను అనపర్తి, మండపేట కూటమి అభ్యర్థులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం రాజమహేంద్రవరంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం జరుగనున్న కౌం టింగ్ సందర్భంగా వీరు దగ్గుబాటి దంపతులతో చర్చించారు. అపై వారిని సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా పురందేశ్వరి, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తన విజయం తథ్యమని, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, కేంద్రంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపడతారని అన్నారు.

తగ్గుతున్న కర్ర పెండలం సాగు

- పామాయిల్ తోటల సాగుకు పయనం
- 5 వేల ఎకరాలకు మాత్రమే పరిమితమయ్యే ప్రమాదం



నాణ్యమైన దుంపవిత్తనం కర్రను సేకరిస్తున్న రైతులు

సామర్లకోట, జూన్ 2 : రాష్ట్రంలో కర్ర పెండలం దుంపసాగు చేసే ఏకైక జిల్లాగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా జాతీయస్థాయిలో పేర్గాంచగా ఆ పంట దిగుబడులకు డిమాండ్ లేకపోవడం, సాగు వ్యయం ఏడాదికేడాది పెరిగిపోవడంతో పలువురు రైతులు కర్ర పెండలం సాగు చేసేందుకు అంతగా ఆశక్తి కనబర్చడంలేదు. ప్రతీఏటా జూన్ నెల మొదటి వారంలో వర్షాలు కురిసినా, కురవకపోయినా దుంప ముచ్చు కర్రలను విత్తనం నారుమడులుగా దుంప రైతులు సన్నద్ధం చేసేవారు. ఈ వారంలో రెండు దఫాలు భారీ వర్షాలు కురిసినా భూములను దుంపసాగుకు సన్నద్ధం చేసేందుకు అంతగా ఆశక్తి కనబర్చకపోవడం అత్యంత విచారకరం. మూడేళ్ల క్రితం వరకూ జిల్లాలో సుమారు 50వేల ఎకరాల వరకూ కర్ర పెండలం దుంప పంట సాగయ్యేది. ఈ ఏడాది జూలై నెలాఖరు నాటికి కేవలం 5వేల ఎకరాలలో మాత్రమే కర్ర పెండలం దుంప పంట సాగు చేసేందుకు అతి తక్కువమంది రైతులు మాత్రమే ముందుకొస్తున్నారని ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. కర్ర పెండలం దుంప ఆధారంగా సగ్గుబియ్యం తయారుచేసే పరిశ్రమలు రాష్ట్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాలలోనే కేంద్రీకృతమైఉన్నాయి. ఒకప్పుడు 38 సగ్గుబియ్యం కర్మాగారాలు ఉండేవి. నేడు కేవలం ఆరు సగ్గుబియ్యం మిల్లులకు మత్రమే పరిమితం అయ్యాయి. మెట్ట ప్రాంతాలలో వర్షాధార పంటగా సాగవుతున్న ఈ కర్ర పెండలం దుంప సాగుకు ప్రత్యామ్నాయంగా అధికశాతం రైతులు పామాయిల్ తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఇక్కడి నేలలు పామా యిల్ తోటల సాగుకు అనుకూలంగా ఉండడమేగాక దిగుబడులకు అధిక ధర లభించడంతో కర్ర పెండలం దుంప సాగు స్థానంలో పామాయిల్ తోటల సాగుకు రైతులు ముందుకె ళుతున్నారు. పామాయిల్ విత్తన మొక్కలు విరివిగా లభిస్తే మొత్తం అంతా పామాయిల్ తోటల సాగు చేపట్టే అవకాశాలు ఉన్నాయని కర్ర పెండలం దుంప సాగుచేసే ఆనూరుకు చెందిన రైతు బండే కొండలరావు చెప్పారు. ఇదే నిజమైతే రానున్న కాలంలో కర్ర పెండలం దుంప సాగు జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే కనమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలక ప్రభుత్వాల వైఖరిల కారణంగా జిల్లాలో చెరకు పంట పూర్తిగా కనమరుగు అయిన విషయం విదితమే. అదే కోవకు కర్ర పెండలం దుంప పంట కూడా చేరనుంది.



విత్తనం కర్ర ముచ్చులను నారుమడులుగా వేసిన దృశ్యం

కాకినాడ

విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు

తాళ్లరేవు, జూన్ 2: పి.మల్లవరం పంచాయతీ పరిధి పేరులేనిచెట్టు (గ్రామంపేరు) ప్రాంతంలో 15కుటుంబాలు అంధకారంలో ఉండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 2 రోజులుగా వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షాల కారణంగా గ్రామంలో చెట్టుపడిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నేటికి విద్యుత్‌శాఖాధికారులు పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ కోరారు.

జనావాసాల చెంత విష సర్పాలు!

» ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలో అపారిశుధ్యం » రోడ్డు పక్కన దుంగల నిల్వలు » చోద్యం చూస్తున్న అధికారులు




సామిల్లు బయట రోడ్డు పక్కన దుంగల నిల్వల దృశ్యం

సర్పవరం జంక్షన్, జూన్ 2: కాకినాడ రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియా అపారిశుధ్యానికి నెలవుగా మారింది. జనావాసాల సముదాయం సమీపంలో గల సామిల్లుల నిర్వాహకులు రోడ్డు పక్కన నెలల తరబడి చెట్ల మానులు, దుంగలు వదిలేయడంతో విష సర్పాలు చేరి, ఇంట్లోకి ప్రవేశిస్తుండడంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని జీవించాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థకు తోడు సామిల్లుల నిర్వాహకులు ఇష్టారీతిలో దుంగలు తీసుకొచ్చి లోపల వేసుకోకుండా బయట రోడ్డు పక్కన వేయడంతో విష సర్పాలకు నిలయంగా ఇవి మారాయని, తక్షణమే ఈ విషయమై అధికారులు కలుగజేసుకుని దుంగలు తొలగించి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

విష సర్పాలతో భయాందోళన

కాకినాడ రూరల్ రమణయ్యపేటలో సుమారు 34 ఏళ్ల కిందట ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని కోసం సుమారు 150 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమల స్థాపన కోసం 250 మందికి ప్లాట్లు కేటాయించారు. సుమారు మూడు దశాబ్దాల కిందట నిర్మించిన డ్రైనేజీలు, రోడ్లు కావడంతో రహదారులు, డ్రైనేజీలన్నీ ఛిద్రంగా మారాయి. పరిశ్రమల్లో మురుగునీరు ముందుకెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇండస్ట్రీయల్ ఏరియాలో కర్రల అడితి (సామిల్లులు) ఉన్నాయి. ఇవీ అన్నీ జనావాసాల సమీపంలో ఉండటం, అడితికి వచ్చే చెట్ల మానులు, దుంగలు రోడ్డు పక్కనే నెలల తరబడి ఉంచేయడంతో చెత్తా,చెదారం చేరి విషసర్పాలు చేరుతున్నాయి. ముఖ్యంగా గంగరాజునగర్ 1 ఇండస్ట్రీయల్ ఏరియా ఆదిత్య ఐఐటీ స్కూల్ కాల్వ పక్క న జనావాసాలు ఉన్నాయి. ఇదే ప్రాంతంలో 40 అడుగుల రోడ్లు ఉన్నాయి. వీటికి పక్కనే సామిల్లులు ఉండటం, చెట్ల మానులు, దుంగలు తీసుకొచ్చి డంపింగ్ చేయడంతో విష సర్పాలు చేరుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి దుంగలు నిల్వ ఉంచేయడంతో ప్రమాదకరమైన విషపు పాములు వచ్చి ఇళ్లలోకి చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పగటి పూట కనిపిస్తే పాములను చూచి చంపేస్తున్నామని, రాత్రి సమయాల్లో పాములు ఎక్కడ గదిల్లోకొచ్చి ప్రాణ నష్టం కలిగిస్తాయనే భయాందోళనలో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని జీవిస్తున్నామని వాపోయారు. సామిల్లుల నిర్వాహకులు కేటాయించిన స్థలాల్లో కలప డంప్ చేయకుండా, రోడ్లపైనే వేసి వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. అసలే పారిశ్రామిక వాడలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు అంతా వచ్చి రోడ్లపై వచ్చి ప్రవహించడం, దోమలతో అనారోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నామన్నారు. ఇప్పుడు సామిల్లుల నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా విష సర్పాలతో ఎక్కడ ప్రాణాలు కోల్పోతామోనన్న భయాందోళనలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుసార్లు పంచాయతీ, ఏపీఐఐసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని తక్షణం రోడ్ల పక్కన డంప్ చేసిన చెట్ల మానులు, దుంగలను తొలగించేందుకు కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గంగరాజునగర్ 1లో నివాస సముదాయాల వద్ద విష సర్పం



ఓ ఇంట్లోకి ప్రవేశించిన విష సర్పం

కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు : కలెక్టర్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 2: జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హాజరయ్యారు. ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమ నిబంధనల మేరకు కౌంటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కౌంటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించవద్దని, రౌండ్ల వారీగా కచ్చితమైన ఫలితాలను నిర్దేశించిన ఫారం ప్రకారం పంపించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ హాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలైన ఓట్ల సంఖ్యను అనుసరించి 15 నుంచి 19 రౌండ్ల వరకూ కౌంటింగ్ జరుగుతుందని, కౌంటింగ్ కేంద్రం వద్ద 200 మీటర్ల వరకూ రెడ్‌జోన్‌గా ప్రకటించామన్నారు. మీడియా సెంటర్ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఇతరసదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి : రాజప్ప

సామర్లకోట, జూన్ 2: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఈ నెల 4న కాకినాడలో జరగనున్న పెద్దాపురం అసెంబ్లీ, పార్లమెంట్ సిగ్మెంట్‌ల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో టీడీపీ తరపున పాల్గొనే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. ఆదివారం సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు చల్లా బుజ్జి, కోట అప్పారావు, చల్లా ప్రభాకరరావు తదితరులతో కలసి ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన మెళకువలను రాజప్ప వివరించారు. ఎన్నికలలో అత్యంత కృషి చేసి పార్టీ విజయానికి సహకరించిన కార్యకర్తలను అభినందించారు. మాజీ జడ్పీటీసీ గుమ్మళ్ళ విజయలక్ష్మిరామకృష్ణ తదితరులున్నారు.

'ప్రభుత్వం రైతులతో చర్చించి హామీలు ఇవ్వాలి'



పి.మల్లవరంలో చర్చిస్తున్న రైతులు

తాళ్లరేవు, జూన్ 2: ఖరీఫ్ పంట ముందుకు సాగాలంటే ప్రభుత్వం రైతులతో చర్చి ంచి నమ్మకం గల హామీలు ఇవ్వాలని లేకుంటే పంటసాగు చేయలేమని రైతుసంఘం నాయకుడు గుత్తుల మహేష్ అన్నారు. ఆదివారం పత్తిగొంది వంతెనపై రైతులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఖరీఫ్ పంట సాగుకు తీసుకోవాల్సిన డిమాండ్లపై చర్చించారు. ఖరీఫ్, రబీ రెండుపంటలకు ప్రభుత్వం సక్రమంగా సాగునీరు అందివ్వక రైతులకు తీవ్రంగా పంటనష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటకాలువలను ఎక్స్‌కవేటర్లతో పూర్తిగా తవ్వించాలని, కాలువలపై పైపులను, లెవిలింగ్స్‌ను సరిచేసి డ్యామ్ నిర్మాణం చేపట్టాలని, సౌపాన్ వద్ద నీరువచ్చే తొట్టికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ల వినతిపత్రంతో త్వరలో కలెక్టర్‌ను కలిసేందుకు సన్నద్ధం అవుతున్నట్లు తెలిపారు. రైతుల ఉద్యమానికి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు సంపూర్ణ మద్దతును తెలియజేశారు. సమావేశంలో రైతులు కడియాల శ్రీనివాసరావు, పితాని సత్తిబాబు, పిల్లి గోవిందు, నాగేశ్వరరావు, దంగేటి భైరవమూర్తి పాల్గొన్నారు.

'దళితులకు న్యాయం చేయాలి'

ఏలేశ్వరం, జూన్ 2: తిరుమాలి గ్రామానికి చెందిన దళితులకు న్యాయం చేయాలంటూ సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు దళితులతో కలిసి ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినోబాబా భూదాన బోర్డు వారు పేదలకు ఇచ్చిన పట్టాల ప్రకారం బాధితులకు న్యాయం చేయాలని, 10రోజుల క్రితం భూ యాజమానులు తహశీల్దార్ రంగారావుకు, ఎస్ఐ సతీష్‌కు వినతిపత్రం ఇచ్చినా నేటికీ సమస్యను పరిష్కరించలేదన్నారు. భూస్వామి వాగు గణేశ్వరారవు, వరుపుల వీరబాబు ఈ భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చి రియల్ ఎస్టేట్ పేరుతో అమ్మకాలు చేస్తున్నారన్నారు. దళితులకు దానమిచ్చిన భూమిని దౌర్జన్యంగా లాక్కోవడం సరికాదని అధికారులు న్యాయం చేకూర్చాలన్నారు.

'రాష్ట్రంలో కూటమిదే విజయం'

కిర్లంపూడి, జూన్ 2: ఎన్నికల ఫలితాల్లో 150 సీట్లతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధిస్తుందని మాజీ జడ్పీటీసీ భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న వెలువడే ఫలితాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. విజన్ ఉన్న నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మోదీ ప్రభుత్వం ఏర్పాటు కావడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. జగ్గంపేట కూటమి అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూ 25వేల మెజార్టీతో గెలుస్తారన్నారు. జూన్ 4న జరిగే ఫలితాల్లో కూటమి గెలుపు ఖాయమని టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు అన్నారు. కాకినాడ పార్లమెంటు అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్, జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని, కూటమితో రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

రాము మాస్టారుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు

సర్పవరం జంక్షన్, జూన్ 2: తెలుగు సాహిత్యం, భాషాభివృద్ధి కోసం చేస్తున్న సేవలకు గుర్తింపుగా కాకినాడ ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు అనుసూరి రాముకు తెలుగు బుక్‌ఆఫ్ రికార్డు అవార్డు లభించింది. ఆదివారం విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలుగు కళారత్నాలు, సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ యువీ రత్నం చేతుల మీదుగా తెలుగు బుక్ ఆఫ్ అవార్డును అందుకున్నట్లు అనుసూరి రాము మాస్టారు తెలిపారు. ఆయనకు కాలేజీ కరస్పాండెంట్, అసిస్టెంట్ కమిషనర్ చందన, కళాశాల ఛైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అమరేశ్వరరావు అభినందనలు తెలిపారు.

చిన్నారులకు డ్రాయింగ్‌పై శిక్షణ

పెద్దాపురం, జూన్ 2: స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పప్పెట్రీ షో ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే చిన్నారులకు డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, బుద్దా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా పందాలు

రౌతులపూడి, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగారు. 2 రోజులుగా పందాలు జోరు అందుకున్నాయి. పందాలకు సోమవారం అఖరి రోజు కావడంతో మరింత పెరిగాయి. ఎమ్మెల్యేలపై కాకుండా కేవలం సీఎంపైనే పందాలు జరుగుతున్నాయి. కూటమి నాయకులు మంచి ఊపుమీద ఉండగా వైసీపీ వాళ్లు మాత్రం మేకపోతు గాబీర్యం ప్రదర్శిస్తున్నారు. పందాల విషయంలో మాత్రం జంకుతున్నారు. కూటమి వాళ్లు రూ.లక్ష కాస్తే వైసీపీ వాళ్లు నలభై వేలు మాత్రమే కాస్తున్నారు. అయితే మండలంలోని కొన్ని గ్రామాల్లో వైసీపీ నేతలు మాత్రం టీడీపీ వాళ్లతో కూటమిపై రహస్య పందాలు కాస్తున్నట్టు తెలిసింది.

పులిహోర, మజ్జిగ పంపిణీ

సామర్లకోట, జూన్ 2: సామర్లకోట వాసవి యూత్ అసోసియేషన్ సభ్యులతో ఆదివారం మధ్యాహ్నం కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ విగ్రహం వద్ద భక్తులకు పులిహోర, మజ్జిగను పంపిణీ చేశారు. అసోసియేషన్ ప్రతినిధి, దస్తావేజు లేఖరి పేకేటి రమేష్, చినపుత్రయ్యల సౌజన్యంతో ఏర్పాటు వీటిని ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మ విగ్రహానికి విశేష పూజలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. కుసుమంచి శేషగిరిరావు, కూరగాయల గొల్లబాబు, సినెట్ శ్యాంకుమార్, కంచర్ల రాజు, హార్డ్‌వేర్ నాని, ఎయిర్‌టెల్ రాజా తదితరులున్నారు.

పిఠాపురం పీఠంలో జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



పీఠంలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, జూన్ 2: పట్టణ శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణాన్ని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఆదివారం సాయంత్రం సందర్శించారు. పీఠం ద్వారా చేస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సోదరుడు అహ్మద్ ఆలీషా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబులు నాగబాబుకు వివరించారు. పీఠాధిపతితో ఫోన్‌లో మాట్లాడారు. పీఠం చేసిన సేవలను నాగబాబు అభినందించారు. నాగబాబు వెంట నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ మర్రెడి శ్రీనివాస్, పిల్లా శివశంకర్ తదితరులు ఉన్నారు.


నీలపల్లిలో మ్యాజిక్ షో



విద్యార్థులకు మ్యాజిక్‌పై వివరిస్తున్న నాగేశ్వరరావు

తాళ్లరేవు, జూన్ 2: ఇంద్రజాలంలో మహిమలు, మహాత్యాలు ఏమీ ఉండవని కేవలం సైన్స్ సూత్రాలు మాత్రమే ఉంటాయని సైంటిఫిక్ మ్యాజిక్ ప్రముఖుడు కాటూరు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నీలపల్లి హైస్కూల్లో జనవిజ్ఞాన బాలల వేసవి కేంద్రం ఆధ్వర్యంలో యూటీఎఫ్ యానాం ఉపాధ్యక్షులు దంగేటి త్రిమూర్తులు అధ్యక్షతన రెండో రోజు వేసవి వినోదం మ్యాజిక్ షో నిర్వహించారు. నాగేశ్వరరావు పిల్లలు ఎదుట అనేక మ్యాజిక్‌లు చేసి అలరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి.సత్యనారాయణ, కవి రచయిత కీర్తి పురస్కార గ్రహీత దాట్ల దేవదానంరాజు, సమతా విభాగం కన్వీనర్, జెవివి మహిళా నాయకురాలు కాశి కరుణ, విద్యార్థులు, గ్రామస్తులున్నారు.

సాగుకు అన్నదాతల సమాయత్తం



ట్రాక్టర్ సాయంతో దుక్కు దున్నుతున్న దృశ్యం

సామర్లకోట, జూన్ 2: ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. 3 రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు పొలాలను దుక్కి దున్ని నేలను చదును చేస్తున్నారు. సామర్లకోట మండల, పట్టణ డెల్టా ప్రాంతం, మెట్ట ప్రాంతాల్లోనే పొలాలను వరి, కరపెండలం దుంపపంటల సాగుకు సన్నద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో అధిక శాతం రైతులు వరిపంటను సాగుచేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సాగుకు పెట్టబడులు పెరుగుతుండడంతో పాటు, దిగుబడులు తగ్గడంతో కొన్ని రకాల విత్తనాలను సాగు చేసేందుకు వ్యవసాయాధికారులు సూచించినా తాము ఎంచుకున్న రకాలను సాగుచేసేందుకు సాగు పనులతో ముందుకెళ్తున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయడంలో వ్యవసాయశాఖ పూర్తి విఫలమైందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

తొలకరి వర్షాలతో వేసవి దుక్కులు

ప్రత్తిపాడు, జూన్ 2: ప్రత్తిపాడు మండలంలో ఇటీవల కురుస్తున్న తొలకరి వర్షాలకు రైతులు వ్యవసాయ దుక్కుల పనులు చేపట్టారు. మండలంలోని పీఎస్ పూడి, లంపకలోవ, ఉత్తరకంచి, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో పొలాలను వేసవి దుక్కులు పనులు, చదును చేసే పనులు చేపట్టారు. ఖరీఫ్ వరిసాగుకు సంబంధించిన నారుమడుల అభివృద్ధి పనులతో పాటు పామాయిల్, సర్వే, పత్తి మొక్కలు నాటేందుకు వ్యవసాయ దుక్కుల పనులు ముమ్మరం చేశారు.



లంపకలోవలో దుక్కులు దున్నిన పొలం

చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థనలు



పిఠాపురం: నాగపట్నంలోని చర్చికి మోకాళ్లపై వెళ్తున్న యాళ్ల గణేష్

పిఠాపురం, జూన్ 2: టీడీపీ అధినేత నారా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ యువకుడు మోకాళ్లపై చర్చికి వెళ్లారు. పిఠాపురం రథాలపేటకు చెందిన యాళ్ల గణేష్ తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నం వెళ్లాడు. అక్కడ ఉన్న వేళంగిని చర్చికి 1.50కిలోమీటర్ల మేర ఇసుకలో మోకాళ్లపై నడిచి వెళ్లారు. కూ టమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం కావాలని, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇవ్వాలని చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. రాబోయే ఫలితాల్లో కూటమికి స్పష్టమైన మెజార్టీ ఇవ్వాలని ప్రార్థించినట్టు గణేష్ తెలిపారు. చంద్రబాబు సీఎం, వర్మకు ఎమ్మెల్సీతో పాటు మంత్రి పదవి రావాలని మేరీమాతను ప్రత్యేకంగా ప్రార్థించామన్నారు.

దివ్య గెలుపు కోసం పాదయాత్ర

తుని రూరల్, జూన్ 2: టీడీపీ కూటమి తుని ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య భారీ మెజార్టీతో గెలుపొందాలని ఎమ్మార్పీఎస్, దళిత నాయకులు పాదయాత్ర చేపట్టారు. తేటగుంట శివారు జీవగిరి క్షేత్రానికి పాదయాత్రగా తరలి వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమితోనే దళితులకు న్యాయం జరుగుతుందని, రానున్నది కూటమి ప్రభుత్వమని ధీమా వ్యక్తంచేశారు.

కూటమి విజయం కోసం పూజలు

కాకినాడ సిటీ, జూన్ 2: ఓట్ల లెక్కింపులో కూటమి విజయం సాధించాలని కోరుతూ నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి విజయం తథ్యమన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజలు కూటమి వైపు మొగ్గు చూపారన్నారు. వివిధ సర్వేలు కూటమిదే విజయమని స్పష్టం చేశాయని, ఓట్ల లెక్కింపులో ఇదే సరళి కొనసాగుతుందన్నారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా నారా లోకేశ్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాలసాని సాయి లక్ష్మణ్ అందించిన భోజనాలను అన్న జనార్ధన్ పేదలకు అందజేశారు. మండపాక నాగబాబు, కర్రి వీరబాబు, అడపా జగదీష్, ఖాసీం తదితరులు ఉన్నారు.



తునిరూరల్: దివ్య గెలుపొందాలని పాదయాత్రలో పాల్గొన్న దళిత నాయకులు

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు

పిఠాపురం ప్రత్యేక భద్రతా పర్యవేక్షకుడు, ఏసీబీ ఎస్పీ రామ్మోహనరావు



పిఠాపురం సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

పిఠాపురం, జూన్ 2: కౌంటింగ్‌కు ముందు, తర్వాత అలజడులు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం నియోజకవర్గ ప్రత్యేక భద్రతా పర్యవేక్షకుడు, ఏసీబీ ఎస్పీ రామ్మోహనరావు హెచ్చరించారు. పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటి వరకూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమో దు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 18 గ్రామాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్టు చెప్పారు. ఇప్పటికే 506మందికి 147 మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. 107మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఈనెల 6వ తేదీ వరకూ సీఆర్‌పీసీ సెక్షన్ 144కింద నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. కౌంటింగ్ రోజున టపాసులు కాల్చడం లేదా రోడ్లపై నిర్వహించడం, ర్యాలీలు నిర్వహించడం చేయరాదని ఆయన చెప్పారు. వివాదాలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్‌లోని సీఐలు పాల్గొన్నారు.

పవన్‌కు 60వేల మెజార్టీ ఖాయం

మాజీ ఎమ్మెల్యే వర్మ




జనసేన గుర్తు గ్లాసులో టీ తాగుతున్న వర్మ

పిఠాపురం, జూన్ 2: పిఠాపురం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ 60వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో కోలంక, నరసింగపురం, జములపల్లి తదితర గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోనే రికార్డుస్థాయి మెజార్టీతో పవన్ గెలవబోతున్నారన్నారు. రాష్ట్రంలోనూ కూటమి 120 కంటే అధికంగా సీట్లు సాధించి అధికారంలోకి రాబోతున్నదని తెలిపారు. ఎగ్జిట్‌పోల్ అంచనాలకు మించి సీట్లు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసీపీ పాలన తరిమికొట్టాలనే లక్ష్యంతో ప్రజలంతా స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివచ్చి ఓట్లు వేశారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని, రాష్ట్రంలో ప్రజలకు మంచిరోజులు వస్తాయని చెప్పారు.

ఆ గ్రామానికి నో సిగ్నల్స్!

గండేపల్లి, జూన్ 2: గండేపల్లి మండల కేంద్రం నుంచి సుమారు పది కిలోమీటర్ల దూరంలో మారుమూల కొండల మధ్యలో ఉన్న గ్రామం కె.గోపాలపురం. ఆ గ్రామానికి మొబైల్ సిగ్నల్స్‌లు రాక ఫోన్ మాట్లాడాలంటే గ్రామస్తులు రెండు కిలోమీటర్లు నడిచివెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వ ఆన్‌లైన్ సేవలకు సిగ్నల్ లేక అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. రేషన్ తీసుకునేటప్పుడు వేలిముద్రలు పడక తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులకు ఆటంకంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో సైతం సమాచారం చేరవేయడానికి వీల్లేని స్థితిలో ఉన్నామని గ్రామస్తులు వాపోతున్నారు. కొన్నేళ్ల నుంచి ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని, తమ గ్రామంలో టవర్ వేయాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వికసించిన మే పుష్పాలు



కొత్తపల్లి, జూన్ 2: కొత్తపల్లిలో ఓ ఇంటి ఆవరణలో ఆదివారం మే నెల పుష్పాలు వికసించాయి. ఒకేసారి 7 పుష్పాలు వికసించడం పట్ల కె.శ్రీనివాసరావు సంతోషం వ్యక్తం చేశారు.

సానా సతీష్‌ను కలిసిన బండారు



సానా సతీష్‌తో బండారు సత్యానందరావు

కాకినాడ సిటీ, జూన్ 2: అమలాపురం పార్లమెంట్ పరిధిలోని కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం కాకినాడలోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ సానా సతీష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 4న జరగబోయే ఓట్ల లెక్కింపు తదితర రాజకీయ పరిణామాలపై వారు చర్చించారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న సతీష్

ఈనెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్స్ కౌంటింగ్ సరళిపై ఆదివారం రాజానగరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ సానా సతీష్ పాల్గొన్నారు. ఉభయ గోదావరి జిల్లా జోన్-2కి సంబంధించి సుమారు 300 మంది టీడీపీ బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు, పార్టీ సమన్వయకర్తలు పాల్గొన్న ఈ సదస్సులో సానా సతీష్ క్యాడర్‌కు దిశనిర్దేశం చేశారు. సదస్సులో పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, ఇతర ముఖ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో శత రుద్రీయం



అభిషేకం నిర్వహిస్తున్న తుమ్మలపల్లి

కిర్లంపూడి, జూన్ 2: లోక కల్యాణార్థం, ప్రజలంతా ఆరోగ్యంగా ఆనందంగా ఆధ్యాత్మికంగా వర్ధిల్లాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నమామి శ్రీ సాయి శత రుద్రీయం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వేదాధ్యయన సమన్వయకర్త డాక్టర్ కొరారు సాయిశ్రీహరిప్రసాద్ శర్మ తెలిపారు. ఆదివారం మండలంలోని రామచంద్రపురంలో శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాద్ ఆధ్వర్యంలో నమామి శ్రీసాయి శత రుద్రీయం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల బాబు, జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్, ఎంపీటీసీ బండారు వరప్రసాద్, శకుంతల, శివాణి, దాక్షాయిని, సుబ్రహ్మణ్యం, రాజు, శ్రీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



దుర్గాడలో నిర్వహించిన వైద్య శిబిరం

గొల్లప్రోలు రూరల్, జూన్ 2: గొల్లప్రోలు మండలం దుర్గాడ వేగుళ్లమ్మ గుడి వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సాయిప్రియ సేవాసమితి అధ్యక్షుడు, జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ ప్రారంభించారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు 210మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 70మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి కాకినాడ తరలించారు. కార్యక్రమంలో డాక్టర్ బృంద, ప్రోగ్రామింగ్ మేనేజరు సత్యనారాయణ, నాగేశ్వరరావు, హరిబాబు, శ్రీకాంత్, చిన్నబ్బాయి, కందా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

పోర్టు సిటీ (కాకినాడ), జూన్ 2: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాహితీ స్రవంతి నగరఅధ్యక్షుడు మార్ని జానకిరామ్ చౌదరి వక్తలను వేదిక పైకి ఆహ్వానించి సభకు పరిచయం చేశారు. తొలుత నిర్వహించిన కవి స్వరం సభకు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించారు. రాయలసీమ కవి, కథకుడు జి.వెంకటకృష్ణ సాహిత్య నేపథ్యాన్ని అద్దేపల్లి ప్రభు పరిచయం చేశారు. ఆయన రాసిన గరుడ స్తంభం, చిలుకలు వాలిన చెట్టు, దేవరగట్టు తదితర కథా కవితల సంపుటిలను క్లుప్తంగా తెలిపారు. వెంకటకృష్ణ సహకార శాఖ జిల్లా అధికారిగా కాకినాడ రావడం సాహితీ ప్రియులకు సంతోషకరమని కవి గనారా అన్నారు. గరికపాటి మాస్టారు, బొల్లోజు బాబా, గౌరీనాయుడు, మణిబాబు, డాక్టర్ శైలజ తదితరులున్నారు.



సభలో మాట్లాడుతున్న జానకిరామ్ చౌదరి